ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	42.4⁰c	17.9⁰c
ఆదిలాబాద్	42.0⁰c	24.0⁰c
నిజామాబాద్	41.5⁰c	26.8⁰c
ఖమ్మం	41.0⁰c	26.0⁰c
మెదక్	40.4⁰c	21.6⁰c
మహబూబ్‌నగర్	39.0⁰c	26.1⁰c
హైదరాబాద్	38.2⁰c	25.3⁰c
వరంగల్	38.0⁰c	22.5⁰c
కరీంనగర్	38.0⁰c	26.0⁰c
నల్లగొండ	37.0⁰c	25.0⁰c

రాష్ట్రం నిప్పులు కుంపటి

- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నది. ఇప్పడే సాధారణం కంటే మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదవుతున్నది. నల్లగొండ జిల్లా శివన్నగూడెంలో శనివారం అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యినట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది. తెలంగాణలో ఏప్రిల్ 3 వరకు ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు అతుండటంతో ఏప్రిల్ 3 వరకు వడగాలులు ఉంటాయని హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో శనివారం 40-44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ విభాగం తెలిపింది. 19 జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య రికార్డయినట్టు పేర్కొన్నది. నల్లగొండ జిల్లా శివన్న గూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డ య్యినట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది. లక్కవరం రోడ్ (సూర్యాపేట)లో 43, భద్రాచలం (కొత్తగూడెం) 43, సుజాతనగర్ (కొత్తగూడెం) 42.9 నమోదైంది.

దేవాదులలో మోటర్ల నిలిపివేత

కన్నాయిగూడెం, మార్చి 31: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఐదు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ జరుగుతుండగా ఆదివారం అన్నింటినీ బంద్ చేసినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. కొన్నిరోజులుగా ఎగువ నుంచి గోదావరిలోకి వస్తున్న వరదనీరు తగ్గుతున్నది. సమ్మక్క బరాజ్ అన్ని గేట్లను బంద్ చేసినా గోదావరి నీటిమట్టం తగ్గుతూ 73.6 మీటర్లకు పడిపోయింది. ఎగువన ఉన్న దేవాదుల ఎత్తిపోతలకు నీరందే పరిస్థితి లేకపోవడంతో మోటర్లను నిలిపివేశారు. నిరుడు ఇదే నెలలో నీటితో కళకళలాడిన సమ్మక్క బరాజ్ ఇప్పుడు ఎండిపోయి వెలవెలబోయింది.

ట్రిబ్ దబాయింపు!

- సమాచారమివ్వబోమని తేల్చిచెప్పిన బోర్డు
- రిక్రూట్‌మెంట్ పూర్తయ్యాకే ఇస్తామని వెల్లడి
- ఆర్టీఐ అర్జీదారులకు ట్రిబ్ విచిత్ర సమాధానం
- ఫలితాల వెల్లడి నుంచి పదుల సంఖ్యలో పిటిషన్లు
- జీఆర్ఎల్ జాబితా ఇవ్వాలని అభ్యర్థుల పట్టు

హైదరాబాద్, మార్చి31 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల నియామక ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) దబాయిస్తున్నది. దీంతో అర్జీదారుల హక్కులను కాలరాస్తున్నది. బోర్డు వైఖరిపై అభ్యర్థులు మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకత పాటించడమంటే ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9 క్యాటగిరీల్లో మొత్తంగా 9,210 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన ట్రిబ్ ఇటీవలే 8,708 పోస్టులకు ఫలితాలను ప్రకటించింది. 8,304 పోస్టులను భర్తీ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఆయా సొసైటీలకు అలాట్ చేస్తూ నియామకపత్రాలను అందజేసింది. అయితే ట్రిబ్ మాత్రం ఇప్పటివరకు జనరల్ ర్యాంక్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. దీంతో చాలామంది అభ్యర్థులు తాము ఎందుకు పోస్టుకు ఎంపిక కాలేదో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయిస్తున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు ఫిబ్రవరి 26 న ఇదే విషయమైన ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టుల కటాఫ్ మార్కులు ఎన్ని? రూల్ రిజర్వేషన్ ఎలా పాటించారు? సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో ఏ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారనే అంశాలపై సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు వివిధ జిల్లాల నుంచి సైతం ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పీజీటీ అభ్యర్థులు పలువురు వివిధ రకాల సమాచారాన్ని కోరుతూ ఆర్టీఐ కింద అర్జీలను పెట్టుకున్నారు. కానీ ట్రిబ్ మాత్రం వారందరికీ ఒకే సమాధానాన్ని ఇటీవల పంపించింది. 'నియామక ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతున్నది. మీరు అడిగిన సమాచారం ఇవ్వడం ఇప్పుట్లో సాధ్యం కాదు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక బోర్డు వెబ్‌సైట్‌లోనే ఆ సమాచారాన్ని పెడతాం. అక్కడి నుంచి మీరు తీసుకోవచ్చు' అంటూ ట్రిబ్ తేల్చిచెప్పిం ది. ట్రిబ్ సమాధానాలపై అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భర్తీ ప్రక్రియ సమాచారాన్ని వెల్లడి చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థులకు నియామకపత్రాలను అందించాక కూడా ఎందుకు బయటపెట్టడం లేదని అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇతర బోర్డులకు విరుద్ధంగా ట్రిబ్ వ్యవహరిస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీకి ప్రతి విషయంలోనూ గోపత్య పాటించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు.

కోర్టు కేసులతో జంకుతున్న బోర్డు

గురుకుల పోస్టుల భర్తీ విషయంలో ఏ ఒక్క అంశంలోనూ పారదర్శకత పాటించలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఒక్కరోజు వ్యవధిలోనే వేలాది మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అర్ధరాత్రి వరకు హడావుడిగా నిర్వహించిందని నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలో అనేక తప్పులు దొర్లాయని మండిపడుతున్నారు. నియాకమ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇప్పటికే ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, జేఎల్ బోటనీ, జువాలజీ, టీజీటీ, పీజీటీకి చెందిన అనేక మంది అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం ఆయా కేసుల విచారణ కొనసాగుతున్నది. ఇప్పటికే జేఎల్ బోటనీ, నాన్‌జాయినింగ్ పోస్టుల తీరును తప్పుబడుతూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు జీఆర్ఎల్‌ను ప్రకటిస్తే మరిన్ని కేసులు పెరిగే అవకాశముంటుందని, ఈ నేపథ్యంలోనే ట్రిబ్ అందుకు జంకుతున్నదని గురుకుల అభ్యర్థులు వివరిస్తున్నారు.

జీఆర్ఎల్ జాబితా ఎందుకు పెట్టరు?

2018, 2019లో మాదిరిగా జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను ఎందుకు ప్రకటించలేదని అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చాక జీఆర్ఎల్‌ను వెల్లడిస్తే లాభమేమిటని? ఎవరికైనా అన్యాయం జరిగితే ఎవరిని అడగాలని, కోర్టుల చుట్టూ తిరగాలా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీఆర్ఎల్‌ను ప్రకటించాలని వారు పట్టుబడుతున్నారు. గతంలో అభ్యర్థుల వ్యక్తిగత ఐడీల్లో ట్రిబ్ గతంలో పొందుపరించింది. ఆ విధానానికీ ఈ సారి ట్రిబ్ స్వస్తి పలికింది.

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని ఓ ఇంటి వద్ద ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఆస్తిపన్ను వసూళ్లలో 'సిరిసిల్ల' ఫస్ట్

పంచాయతీల్లో 98.19 శాతం వసూలుతో జిల్లా రికార్డు

రాజన్న సిరిసిల్ల, మార్చి 31 (నమస్తే తెలంగాణ): నిరుడు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో మెరిసిన రాజన్న సిరిసిల్ల జిల్లా.. ఈ ఏడాది ఆస్తి పన్ను వసూలులో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పన్ను చెల్లించడంలో జిల్లా ప్రజలు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు. 40 రోజుల గడువులో కార్యదర్శులంతా శ్రమించారు. వ్యవసాయ పొలాల్లో ఉన్న యాజమానుల వద్దకు వెళ్లి ఇంటింటికీ తిరిగి పన్ను వసూలు చేశారు. డీపీవో వీరబుచ్చయ్య పర్యవేక్షణలో 255 మంది కార్యదర్శులు పన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా రూ.7.5 కోట్ల ఆస్తిపన్ను బకాయిలుండగా.. నిర్దేశిత లక్ష్యం మేరకు రూ.6.92 కోట్లు వసూలు చేశారు. 98.19 శాతంతో రాష్ట్రంలోని 32 జిల్లాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 97.67 శాతంతో జగిత్యాల రెండో స్థానం, 97.30 శాతంతో సిద్దిపేట జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జిల్లాలో చందుర్తి, కోనరావుపేట, ఇల్లంతకుంట, రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ మండలాలు 100 శాతం, బోయినపల్లి 99, ముస్తాబాద్ 98, గంభీరావుపేట 98, ఎల్లారెడ్డిపేట 98, తంగళ్లపల్లి 96, కోనరావుపేట 96 శాతం చొప్పున ఆస్తి పన్ను వసూలు చేశాయి.

పోలీసులపై పోడు రైతుల దాడి

మొదటిపేజీ తరువాయి...

వెళ్లగా.. గిరిజనులు వారిపై దాడికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బుగ్గపాడు రెవెన్యూ పరిధిలోని చంద్రాయపాలెంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో 400 ఎకరాల్లో పోడు పట్టాలిచ్చారు. అప్పటి నుంచి చంద్రాయపాలెం గిరిజనులు ఆ భూమిని సాగుచేసుకుంటున్నారు. అయితే.. అందులో 30 ఎకరాల భూమికి సంబంధించి వివాదం నెలకొంది. శనివారం బుగ్గపాడు, ఇతర ప్రాంతాల గిరిజనులు వెళ్లి భూమిని చదును చేస్తుండటంతో చంద్రాయపాలెం గిరిజనులు అడ్డుకున్నారు. 30 ఎకరాల్లో ఉన్న ఆ భూమి తమదంటే తమదని గొడవకు దిగారు. ఈ విషయమై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ కిరణ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను విడదీసే ప్రయత్నం చేస్తుండగా.. బుగ్గపాడుకు చెందిన గిరిజనులు ఒక్కసారిగా పోలీసులపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో సీఐ కిరణ్‌తో సహా మరో ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. అప్పటికే 300 మందికి పైగా గిరిజనులు చుట్టుముట్టి పోలీసులపై దౌర్జన్యానికి దిగడంతో వెనక్కి వచ్చారు. తర్వాత ఏసీపీ అనిశెట్టి రఘు ఆధ్వర్యంలో సబ్‌డివిజన్‌లోని పోలీసులతో కలిసి చంద్రాయపాలెం వెళ్లి దౌర్జన్యానికి దిగిన 30 మందికి పైగా గిరిజనులను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ అనిశెట్టి రఘు, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్‌వో స్నేహలత ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

పోలీసులపై కర్రలతో దాడికి పాల్పడుతున్న గిరిజనులు

ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూడొద్దు : తుమ్మల

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ప్రకృతి వైపరీత్యాలను, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చూడొద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వానకాలం ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, అప్పటికే నాగార్జునసాగర్‌లో నీళ్లు లేక, పంటలకు నీళ్లు ఇవ్వని పరిస్థితి ఉన్నదని చెప్పారు. ఆదివారం జనగామ, సూర్యాపేట జిల్లాల పర్యటనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై తుమ్మల స్పందించారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోలేదని, మే నెల వరకు రైతుబంధు ఇచ్చారని విమర్శించారు.

గురుకుల లా విద్యార్థికి ఓరల్ ప్రజెంటేషన్ అవార్డు

అవార్డు అందుకొన్న తిరుపతి

హైదరాబాద్, మార్చి31 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల లా కాలేజీ విద్యార్థి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను కనబరిచి, అత్యుత్తమ అవార్డు అందుకొన్నారు. ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రిసెర్చ్ అసోసియేషన్, పలు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా బ్యాంకాక్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి గురుకుల న్యాయవిద్య కాలేజీలో నాల్గోసంవత్సరం చదువుతున్న విద్యార్థి మిట్టకడప తిరుపతి పాల్గొన్నారు. 'ఏ క్రిటికల్ స్టడీ- ద లా కమిషన్ అండ్ ఇట్స్ లీగల్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా' అనే పేపర్‌ను ప్రజెంట్ చేశారు. ఇందుకు, తిరుపతి బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థికి ఆ అవార్డు అందజేసి అభినందించారు. విద్యార్థికి అవార్డు దక్కడంపై గురుకుల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శుభాకాంక్షలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న తిరుపతి

• నేటి నుంచి వెబ్‌సైట్‌లో 'మాడల్' హాల్‌టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మాడల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లు సోమవారం విడుదలకానున్నాయి. telanganams. cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మాడల్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. ఈ నెల 7న మాడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తారు.

• బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా ఐదేండ్ల బీఆర్క్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. జాతీయంగా 375 విద్యాసంస్థల్లో ఈ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నుంచి జూలై మధ్యన వారాంతపు రోజుల్లో నిర్వహిస్తారు.

• జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ) ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 649 జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరు, తొమ్మిదో తరగతుల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను నవోదయ విద్యాలయ సమితి తాజాగా విడుదల చేసింది.

• 77 ఏండ్ల పోరాటం ఎస్టీయూ సొంతం

మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానంలో 77 ఏండ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర ఎస్టీయూ సొంతమని ఆ సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో సంఘం బాధ్యులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జీ సదానంద్‌గౌడ్, ఆట సదయ్య, సీ రమేశ్, అవంచ సుధాకర్, పున్న గణేశ్, కృష్ణారెడ్డి, గజేందర్, శ్రీధరరావు, శీతల్‌చౌహన్ పాల్గొన్నారు.

• సీయూఈటీ -యూజీ దరఖాస్తుల గడువు మళ్లీ పెంపు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సెంట్రల్ వర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ -యూజీ దరఖాస్తుల గడువును 5 వరకు మరొకసారి పొడిగిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్ణయం తీసుకొన్నది. సీయూఈటీ పరీక్షలు మే 15 నుంచి 31 వరకు నిర్వహించనున్న విషయం తెలిసిందే.

• జూన్ 9న ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐసర్)ల్లో ప్రవేశాలకు ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐఏటీ)ను జూన్ 9న నిర్వహించనున్నారు. సోమవారం నుంచి మే 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మేనెల16, 17 తేదీల్లో దరఖాస్తుల సవరణకు అవకాశం ఉన్నది.

కడియం కులంపై విచారణ జరపాలి

టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

మఖీరాబాద్, మార్చి 31: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కులంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. మాదిగ నేతను కాదని కడియం కావ్యకు కాంగ్రెస్ వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే ఆ పార్టీని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. మాదిగలను మోసం చేస్తూ, అణచివేస్తూ ఎదిగిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కులం ఎంటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నదని, ఆయన కులం విషయంలో మొదటి నుంచీ సందేహాలు ఉన్నాయని తెలిపారు. 30 ఏండ్లుగా మాదిగనని చెప్పుకున్న కడియం బీఆర్ఎస్‌లో చేరినప్పుడు బైండ్ల కులంగా చెప్పుకున్నారని తెలిపారు. మాదిగ ఉప కులం అయినప్పటికీ మాదిగ కులంగా చెప్పుకొని తమ జాతి నేతల అవకాశాలకు అడ్డు తగిలారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో మోత్కుపల్లి నర్సింహులును ఎదుగకుండా కడియం శ్రీహరి కుట్ర చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి తాటికొండ రాజయ్యను ఎదగనీయలేదని, ఆయన పదవి పోవడానికీ కారకుడయ్యారని ఆరోపించారు. మాదిగలను కాదని బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ ఇస్తే గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం, తన బిడ్డ కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇప్పించుకోవడానికి మాదిగలకు టికెట్ దక్కకుండా అడ్డుపడుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రాకు చెందిన ముస్లింను వివాహం చేసుకున్న కడియం కావ్యకు తెలంగాణతో ఏంపని అని వంగపల్లి ప్రశ్నించారు. మాదిగలను విస్మరిస్తే చంద్రబాబుకు ఏ గతి పట్టిందో భవిష్యత్తులో రేవంత్‌కూ అదేగతి పడుతుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బుజ్జగింపులు

ఇంటికి వెళ్లి బీజేపీ నేతల చర్చలు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే రా జాసింగ్‌ను బుజ్జగించే చర్యలను రాష్ట్ర బీజేపీ మొదలుపెట్టింది. 2 నెలలకుపైగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న రాజాసింగ్ ఇంటికి ఆదివారం బీజేపీ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి వెళ్లారు. ఆయనతో సమావేశమైన అనంతరం అభ య్ పాటిల్ మీడియాతో మాట్లాడారు. రాజాసింగ్ ఇబ్బందులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన సేవలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు.

ప్రలోభాల గురి.. దర్యాప్తు బూచి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్ష నేతలను ప్రలోభాలకు గురి చేసి లొంగదీసుకోవడం.. లేదం టే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థల పేరిట భయభ్రాంతులకు గురిచేయడం.. వినకుంటే అరెస్టు చేసి జైలులో పెడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. హైదరాబాద్ ఎంబీ భవన్‌లో ఆదివారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయ న పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాల ఎన్నికల క్యాంపెయిన్‌ను బీజేపీ బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతున్నదని ఆరోపించారు.

• బెజ్జంకి యువతికి మిస్ టీన్ టైటిల్

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లికి చెందిన ప్రమోద్‌రావు, సరిత దంపతుల కుమార్తె సుహానీరావు మిస్ టీన్ గెలాక్సీ పేజెంట్ యూకే టైటిల్ గెలుచుకుంది. యూకేలోని వారింగ్‌టన్ పార్ హాల్‌లో యునైటెడ్ కింగ్‌డమ్ నలుమూలల నుంచి 25 మంది యువతులతో కలిసి పోటీపడి అన్ని విభాగాల్లో ప్రతిభ కనబర్చి దక్షిణాసియా మొదటి విజేతగా నిలిచింది. వచ్చే ఆగస్టులో యూఎస్‌ఏలో జరిగే పోటీల్లో యూకే తరపున ప్రాతినిధ్యం వహించనున్నది. – బెజ్జంకి

కడియం టికెట్‌పై పీటముడి

మొదటిపేజీ తరువాయి...

సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ లేక దొమ్మాటి సాంబయ్య పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ పెట్టిన కండిషన్‌కు కడియం శ్రీహరి అంగీకరిస్తే, అప్పుడు నాగర్ కర్నూల్ అభ్యర్థిగా ప్రకటించిన డాక్టర్ మల్లు రవిని మార్చి అక్కడ మాదిగ సామాజిక వర్గానికి చెందిన నంది శ్రీహరికి (దివంగత మాజీ ఎంపీ నంది ఎల్లయ్య కుమారుడు) టికెట్ ఇవ్వాలని అధిష్ఠానం తాజాగా పునరాలోచనలో పడినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పీటముడి కారణంగానే ఢిల్లీలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ భేటీలో తెలంగాణ అభ్యర్థుల ఎంపికను సోమవారానికి వాయిదా వేసినట్టు సమాచారం. ఈ పరిణామాల వల్లనే ఆదివారం ఢిల్లీ వెళ్లాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఉండిపోయినట్టు తెలిసింది. కాగా కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్.. ఈ నాలుగు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఇంకా ఖరారు చేయాల్సి ఉన్నది. వరంగల్, కరీంనగర్ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాకపోవడంతో సీఈసీ సోమవారం తిరిగి సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందన్న వాదనతో పార్టీ అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు తెలిసింది. తెలంగాణలో ఎస్సీలకు మూడు ఎంపీ స్థానాలు రిజర్వు కాగా, ఇందులో ఇప్పటికే నాగర్ కర్నూల్, పెద్దపల్లి నుంచి మాల సామాజిక వర్గానికి చెందిన మల్లు రవి, గడ్డం వంశీని అభ్యర్థులుగా ప్రకటించింది. మిగిలిన వరంగల్ స్థానం నుంచి కూడా అదే మాల సామాజిక వర్గానికి చెందిన కడియం శ్రీహరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే, మాదిగ ఓటర్లను దూరం చేసుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ అధిష్ఠానం జంకుతున్నట్టు తెలిసింది. దీనివల్ల కడియం శ్రీహరి అభ్యర్థి అయ్యే పక్షంలో నాగర్‌కర్నూల్‌లో మల్లు రవికి బదులుగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నంది శ్రీహరికి టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది. గతంలో ఆయన తండ్రి, మాజీ ఎంపీ నంది ఎల్లయ్య ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

ఖమ్మం నుంచి రఘురామిరెడ్డి ఖరారు?

కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారిన ఖమ్మం అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. 'పిట్ట పోరు పిట్టపోరు పిల్లి తీర్చింది' అన్న చందంగా ఖమ్మం టికెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన సతీమణి నందిని కోసం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి కోసం పట్టుబట్టడంతో వీరిద్దరికీ కాకుండా మూడో వ్యక్తిగా రఘురామిరెడ్డిని ఎంపిక చేసినట్టు తెలిసింది. దాదాపు ఈయన అభ్యర్థిత్వం ఖరారు అయినట్టేనని ఢిల్లీ కాంగ్రెస్ వర్గాల సమాచారం. రఘురామిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు కావడం కూడా కలిసొచ్చినట్టు తెలిసింది. రఘురామిరెడ్డి ఎంపికలో మరో రెండు ట్విస్టులు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈయన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వయానా వియ్యంకుడు కావడం ఒకటైతే, రెండోది రఘురామిరెడ్డి కుమారుడికి కమ్మ సామాజిక వర్గానికి చెందిన హీరో వెంకటేశ్ కూతురును ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో కమ్మ సామాజిక వర్గం ఓట్లు కూడా పొందవచ్చని కాంగ్రెస్ వ్యూహంగా చెప్తున్నారు. ఖమ్మం నుంచి పారిశ్రామికవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, ఎన్టీఆర్ మనవరాలు, హరికృష్ణ కూతురు సుహాసిని పేరు కూడా పరిశీలనకు వచ్చినట్టు తెలిసింది. జూనియర్ ఎన్టీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు కావడంతో ఆయన సోదరి సుహాసిని పేరును పరిశీలనకు చివరి నిమిషంలో ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదని తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వీరిద్దరికీ కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతించారు. బీఆర్ఎస్ తమ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కావ్యను ప్రకటించినప్పటికీ ఆమె బరిలో నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశంలో వరంగల్ అభ్యర్థి ఎంపికపై చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఈ స్థానం నుంచి కడియం శ్రీహరిని బరిలోకి దింపుతుందా? లేక కావ్యకు అవకాశం ఇస్తుందా అనేది తేలనున్నది.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలుంటాయా?

- నెట్ స్కోర్‌తోనే ప్రవేశాలకు యూజీసీ నిర్ణయం
- అన్ని వర్సిటీలకు లేఖలు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు యూజీసీ చేతుల్లోకెళ్లనున్నాయా? ఇక నుంచి వర్సిటీల వారీగా ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలుండవా ? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇటీవలే పీహెచ్‌డీ అడ్మిషన్లపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక ప్రకటన చేసింది. 2024 -25 విద్యాసంవత్సరం నుంచి పీహెచ్‌డీ కోర్సుల్లో యూజీసీ నెట్ స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పించాలని అన్ని వర్సిటీలకు లేఖలు రాసింది. తాజా మార్గదర్శకాల ప్రకారం మూడు క్యాటగిరీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పిస్తారు. క్యాటగిరీ -1లో జేఆర్ఎఫ్ ఉన్న వారికి పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించడంతో పాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించే అవకాశం ఉన్నది. ఇలాంటి వారిని వర్సిటీలు కేవలం ఇంటర్వ్యూల ఆధారంగా అడ్మిషన్లు జారీచేస్తాయి. ఇక క్యాటగిరీ -2లో జేఆర్ఎఫ్ లేకుండా పీహెచ్‌డీలో అడ్మిషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం కల్పిస్తారు. క్యాటగిరీ -3 కేవలం పీహెచ్‌డీ కోర్సుల్లో మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. క్యాటగిరీ -2, 3 అడ్మిషన్లకు 70 శాతం మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూకు 30 శాతం మార్కుల వెయిటేజీ ఉంటుంది. ప్రస్తుతం జారీచేసే నెట్ స్కోర్ ఒక సంవత్సరం పాటు చెల్లుబాటు అవుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే మహాత్మాగాంధీ, పాలమూరు వర్సిటీలు యూజీసీ – నెట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. తాజాగా యూజీసీ ప్రకటన నేపథ్యంలో ఓయూ, కేయూలు ప్రవేశ పరీక్షలను నిర్వహించుకోవాలా? లేదా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

నెట్‌తో ఏ వర్సిటీకైనా పోటీపడొచ్చు

నెట్ ద్వారా విద్యార్థులు దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు అవకాశం ఉంటుంది. వర్సిటీలు నిర్వహించే అనేక ప్రవేశ పరీక్షలను రాయాల్సిన అవసరం లేదు. అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ ప్రవేశాలకు నెట్ స్కోర్‌ను ఉపయోగించేందుకు మార్గదర్శకాలు జారీచేశాం. *- ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్, యూజీసీ చైర్మన్*

మిస్టర్ రేవంత్‌రెడ్డి.. ఖబడ్దార్

దొరసాని అన్నందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: డీకే అరుణ



మహబూబ్‌నగర్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మిస్టర్ రేవంత్‌రెడ్డి ఖబడ్దార్.. నీ కథేందీ.. నోటికొచ్చిన ట్టు మాట్లాడితే సహించం.. వ్యక్తిగత విమర్శలు మానుకో'.. అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హెచ్చరించారు. 'మీ ఇంట్లో ఆడవారిని ఇలానే దొరసాని అని మాట్లాడుతావా?' అని నిలదీశారు. ఆదివారం ఆమె మహబూబ్‌నగర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి, ను వ్వు సీఎంవా? ఆ మాటలేంది? పార్లమెం ట్ ఎన్నికలకంటే ముందే ప్రభుత్వంపై అభద్రతాభావం మొదలవడంతో పాటు.. నీకు ఓటమి భయం పట్టుకున్నది. నన్ను కించపరిచేలా దొరసాని అని మా ట్లాడినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. సీఎం పదవి వచ్చినా నీ తీరు మార్చుకోకపోతే ఎలా? ఇంకా ప్రతిపక్ష నేతగానే మాట్లాడితే ఎలా? కొంచమైనా తెలివి ఉండొద్దా? ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని అంటున్నావు. ఓటుకు నోటు వ్యవహారం నీకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు కదా? ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని కోట్లు ఇచ్చి ఓట్లు కొన్నావో చెప్పాలి?అని అరుణ డిమాండ్ చేశారు.